# రంజాన్ పండగ దృష్ట్యా పరీక్ష తేదీ మార్పు చేయాలి

**ఒంగోలు, ప్రభాతవార్త**




పవిత్ర రంజాన్ మాసంలో ముప్పై రోజులు కటినమైన ఉపవాస దీక్షలు చేసి భక్తి శ్రద్ధలతో ముస్లింలు రంజాన్ పండుగ జరుపుకుంటారు, నెలవంక చూసి పండుగ జరుపుకునే ఆనవాయితీ లో భాగంగా ఈ సంవత్సరం మార్చి 21 శనివారం జరుపుకోనున్నారు. కానీ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వం 20వ తారీఖున సెలవు ప్రకటించింది. ఇదే సందర్భంగా 21 వతేదీన పదో తరగతి పరీక్ష షెడ్యూల్ చేయబడింది కాబట్టి పండగ రోజు పరీక్ష నిర్వహిస్తే ముస్లిం విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కావున విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పదోతరగతి ఇంగ్లీష్ పరిక్ష తేదీని ఇరవై ఒకటిన కాకుండా మరొక తేదికి మార్పుచేస్తే ముస్లిం విద్యార్థులకు మేలు చేసిన వారవుతారని ముస్లిం ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు పఠాన్ కరిముల్లా ఖాన్,సయ్యద్ ఇస్మాయిల్, షేక్ మహ్మద్ రఫీ తదితరులు కోరారు.

# ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పేద ముస్లింలకు దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు నిత్యావసర సరుకులతో పాటు బియ్యం( రంజాన్ తోఫా ) పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సందర్భంగా పేద ముస్లింలకు ఫౌండేషన్ ద్వారా పదేళ్లుగా నిత్యావసర సరుకులు అందజేయడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. దీనితోపాటు అనేక సందర్భాల్లో పేదలకు పేద విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా తమ వంతు సహాయము గా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందించడం ఆనందంగా ఉన్నది అని తెలియచేసారు. ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమము లో దోస్తీ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ భాషా ,షేక్ హుస్సేన్ (హాజీ), అబ్దుల్ సలార్ , షేక్ అహ్మద్ (హాజీ), దన్నారపు మస్తాన్ రావు ,నత్తల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సిఎం చేతుల మీదుగా కళారత్న(హంస)పురస్కారం అందుకున్న నాగభైరవ

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళారత్న (హంస) పురస్కారాన్ని అందుకున్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త, శతాధిక గ్రంథకర్త ,భాషా విభూషణ బిరుదాంకితులు "మట్టి బండి" రైతు గేయ కావ్యకర్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ. ఈ సందర్భంగా జిల్లా రచయితలు, కవులు,పలు సాహితీ సంస్థల నిర్వాహకులైన నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డా నూనె అంకమ్మరావు,కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లిఖార్జునరావు, కోవెలకుంట్ల బాలకోటయ్య,యు.వి.రత్నం, గుంటూరు సత్యనారాయణ, ఒరుగంటి ప్రసాద్, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ తదితరులు ఆదినారాయణ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



**అవార్డు అందుకున్న ఎస్వీ శివకుమారి**

పరాభవ నామ సంవత్సర ఉగాదినాడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరము ప్రతిష్టాత్మకంగా ఇచ్చేటువంటి ఉగాది పురస్కారాలలో ఎస్వీ శివకుమారి కూచిపూడి నృత్య విభాగంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలులో ప్రకాశం జిల్లాలో ఉన్నటువంటి వివిధ కళా సంస్థలు, కళాభిమానులు, తోటి కళాకారులు శివ కుమారి గారిని అభినందించారు.

# భక్తులతో కిటకిటలాడిన జాళ్ళపాలెం

**కొండపి, ప్రభాతవార్త**



ఉగాది పర్వదినం సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల సందర్భంగా జాళ్ళ పాలెం భక్తులతో కిటకిటలాడింది ఉదయం నాలుగు గంటల నుండి బ్రహ్మంగారి మఠం వద్ద భక్తులు సందడి మొదలైంది .ముందు రోజు రాత్రి బ్రహ్మంగారిమఠం వద్దకు చేరుకున్న భక్తులుచుట్టూ పొంగళ్ళులో పొంగించుకుని తమ మొక్కులు తీర్చుకుంటున్నారు, 8 గంటల నుండి భక్తులతో బ్రహ్మంగారి మఠం వద్ద రద్దీ పెరిగిపోయింది, క్యూలో భక్తులు కిటికీలాడారు, పొంగల్ పొంగిచ్చుకున్న భక్తులు బ్రహ్మంగారి మఠం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు చెల్లించుకున్నారు, మొక్కుబడులు ఉన్నవారు, తమ తలనీలాలు సమర్పించు కొని ముక్కులు తీర్చుకున్నారు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చారు, మఠం వద్ద భక్తులతో కిక్కిరిసిపోయాయి,దాతలు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాలు త్రాగునీటి సౌకర్యాలు ఉచితంగా భక్తులకు అందించారు, తిరునాళ్ల జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తుతో చర్యలు తీసుకున్నారు,

# అలరించిన ఉగాది కవి సమ్మేళనం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఉగాది సందర్భంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఒంగోలు రైస్ మిల్లర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించబడిన ఉగాది వేడుకల్లో కవి సమ్మేళనం, చిన్నారుల నృత్యాలు అలరించాయి. ప్రముఖ కవి పొన్నూరు శ్రీనివాసులు వ్యాఖ్యాతగా నిర్వహించబడిన కవి సమ్మేళనంలో ఎనిమిది మంది కవులు తమ పద్య, వచన కవితలు వినిపించారు. మహతి తన్నీరు బాలాజీ, ఆళ్ల వెంకటేశ్వర్లు, పెండ్యాల గాయత్రి, వి.మురళీ మోహన్, బి.శ్రీనివాస్, వెంకట్రావు, సునీత, నాగేశ్వరరావు తదితరులు సామాజిక అంశాలపై చైతన్యం కలిగిస్తూ, తెలుగు సంవత్సరాది ఉగాది విశ్వానికి శుభాలు చేకూర్చాలని తమ కవితలను వినిపించారు. వీరిని శాలువా, మెమోంటోతో జిల్లా యంత్రాంగం సత్కరించారు.

# పోలీస్ ప్రధాన కార్యాలయంలో పూజలు నిర్వహించిన ఎస్పీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని, శ్రీ సీతారామచంద్ర స్వామి భక్త జన సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీ సీతారాముల స్వామి వారి పూజా కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ నూతన పంచాంగాన్ని ఆవిష్కరించి, పంచాంగాలను భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ సిబ్బందికి మరియు జిల్లా ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సర (ఉగాది) శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# నావీ ముంబైలో ఘనంగా ఉగాది వేడుకలు

**- ముఖ్య అతిథిగా హాజరైన శ్యామల కాశిరెడ్డి**

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



నావీ ముంబైలో తెలుగు కళా సమితి వారి ఆధ్వర్యంలో గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ప్రకాశం జిల్లా డీసీ ఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా,ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు కళా సమితి కమిటీ సభ్యులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా శ్యామల కాశిరెడ్డి తెలిపారు. విదేశాల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగు ప్రజలనుఒకేవేదికపైకి తీసుకురావడంలో తెలుగు కళాసమితి చేస్తున్న సేవలను ఆయన అభినందించారు.

# దైవానుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి








**- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**ఒంగోలు, ప్రభాతవార్త**

దైవానుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆకాంక్షించారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు గురువారం ఒంగోలులోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు దంపతులు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచిత్ర, ఇతర ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలతో అధికారులు వీరికి స్వాగతం పలుకగా, ప్రముఖ వేద పండితుడు దక్షిణామూర్తి ఈ సంవత్సర పంచాంగాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టు, రామాయపట్నం పోర్టు, సంగమేశ్వరం, కొరిశపాడు, ఇతర ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా దైవాశీస్సులతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. అన్ని రంగాలలోనూ జిల్లా ప్రకాశించాలని మంత్రి అభిలాషించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అధికారి యంత్రాంగం త్వరగా పూర్తి చేయటం ద్వారా ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి వివిధ ప్రాజెక్టులను తీసుకువచ్చేలా ముఖ్యమంత్రి పడుతున్న తపన సహకారం కావాలని, ప్రకాశం, మార్కాపురం జిల్లాలు సంపన్నం కావాలని ఆకాంక్షించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే, ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలకు అన్ని విధాలుగా మేలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను, ప్రజలను దక్షిణామూర్తి ఆశీర్వదించారు. అనంతరం ఆయనతో పాటు మరో నలుగురు అర్చక స్వాములను అతిథులు సత్కరించారు. వట్యం నగేశ్వర విశ్వనాథ శర్మ, నాదెండ్ల నాగేశ్వరరావు, నడింపల్లి లక్ష్మీనారాయణ, పరాంకుశం శ్రీనివాస చార్యులకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ తరుపున ఒక్కొక్కరికి రూ.10,116 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకర్షించాయి. ఈ వేడుకల్లో డీఆర్ఓ చిన్న ఓబులేసు, దేవదాయ శాఖ సహాయ కమీషనర్ పానకాలరావు, పలువురు జిల్లా స్థాయి అధికారులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన 79 సిలిండర్లును పట్టుకున్న విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ బృందం

**సంతనూతలపాడు ( మద్దిపాడు) మార్చి 19, ప్రభాతవార్త**



మద్దిపాడు మండలం గ్రోత్ సెంటర్‌ల నందుగల మూడు ఫ్యాక్టరీలలో అక్రమంగా నిల్వ ఉంచిన 79 గ్యాస్ సిలిండర్‌లను గురువారం నాడు ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు ఈ మేరకు దాడులు చేసి పట్టుకొని సీజ్ చేశారు. ఒక డాల్ మిల్లు నందు 39 కమర్షియల్ సిలిండర్లను, అదేవిధంగా గ్రోత్ సెంటర్ నందు ఒక ఆక్సిజన్ ప్లాంట్ నందు 20 కమర్షియల్ సిలిండర్లను, ఒక గ్రానైట్ ఫ్యాక్టరీ నందు 11 కమర్షియల్, 9 డొమెస్టిక్ సిలిండర్లు ను విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లైసెన్సు లేకుండా సిలిండర్లు నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఈ మేరకు సమాచారం రావడంతో ఆయా ఫ్యాక్టరీల నందు దాడులు చేసి వీటిని పట్టుకున్నట్లు ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవరావు పేర్కొన్నారు. పట్టుకున్న సిలిండర్లను మద్దిపాడు లోని విజయ శ్రీ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారికి ఈ మేరకు విజిలెన్స్ బృందం అప్పగించారు. ఆయా సిలిండర్ల ఇలాకా ముగ్గురుపై తగు చర్యల నిమిత్తం 6a కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. వీటిని జాయింట్ కలెక్టర్ కోర్టులో నమోదు చేయుటకు అధికారులు నిర్ధారించారు. ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావు కు రాబడిన సమాచారం మేరకు ఈ మేరకు నిర్వహించిన గ్యాస్ సిలిండర్లపై దాడులు చేసి పట్టుకున్నట్టు సిఐ రాఘవరావు తెలిపారు. ఈ దాడుల్లో ఒంగోలు విజిలెన్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవరావు, తహసిల్దార్ వి. ఎస్.పాల్, అగ్రికల్చర్ ఆఫీసర్ శివ నాగ ప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, ఒంగోలు సివిల్ సప్లై అసిస్టెంట్ ఫుడ్ ఇన్స్పెక్టర్ గుణ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం.. మజ్జిగ పంపిణీ చేసిన దద్దాల నారాయణ

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని పులి వెంకటరెడ్డి పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం ప్రారంభించారు. బత్తుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు దాహం తీర్చేందుకు చలివేంద్రలు ఏర్పాటు చేయడం మంచి సేవా కార్యక్రమమని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కటికల వెంకటరత్నం, మోడీ నారాయణరెడ్డి, భవనం కృష్ణారెడ్డి, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, వేషపోగు గురు ప్రసాద్, ఏళ్ల కృష్ణారెడ్డి, రుద్రపాటి సాల్మన్ రాజు, నెంబర్ షరీఫ్, వడ్లమూడి చిన్న, వంకదారి రాజా, నరసింహ, వేముల సుష్మ, పూస సురేష్, కూచిపూడిపల్లి వైఎస్సార్ యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# చింతలపాలెంలో నూతన డ్రైనేజీ శంకుస్థాపన

**- ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో పనులు ప్రారంబం**

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణం 4వ వార్డు చింతలపాలెంలో నూతన డ్రైనేజీ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలోమున్సిపల్ సిబ్బందితో కలిసి తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ పట్టణంలోని కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి ఈ పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, షేక్ ఖాజా రెహ్మాన్, బుల్ల బాలబాబు, పాతూరు నాగ, బి.రామసుబ్బారెడ్డి, మూలే బ్రహ్మారెడ్డి, నాగయ్య, శ్రీనివాసరెడ్డి, పెన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలోకి రీ ఎంట్రీపై తేల్చేసిన బాలినేని

**- ఆయన నాయకుడు మాత్రమే కాదు..!**

**- బాలినేని పవన్‌ను ట్విట్ చేసిన అంశం సోషల్ మీడియాలో హల్చల్**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కూటమి, వైసీపీ మధ్య కొత్త రాజకీయ వ్యూహాలు తెరమీదకు వస్తున్నాయి. కూటమి లక్ష్యంగా జగన్ విమర్శల తీవ్రత పెంచారు. అదే సమయంలో కూటమి 2029 ఎన్నికల టార్గెట్‌గా కార్యచరణ అమలు చేస్తుంది. ఈ సమయంలోనే వైసీపీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని వ్యవహారంపై కొంతకాలంగా రాకీయంగా చర్చ జరుగుతుంది. జనసేనలో చేరిన గుర్తింపు లేకపోవడంతో తిరిగి వైసీపీలోకి వస్తారనే ప్రచారం వేళ బాలినేని స్పష్టత ఇచ్చారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి 2024లో వైసీపీలో ఓటమి తరువాత జనసేనలో చేరారు. ఎన్నికల ఫలితాల తరువాత, ఓటింగ్ ఈవీఎంలపైన అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆ తరువాత పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. వైసీపీపైన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అప్పటికే ఎంపీ వైవీ సుబ్బారెడ్డితో ఉన్న విభేధాలతో బాలినేని ఆగ్రహంతో ఉన్నారు. అయితే జనసేనలో చేరిన తరువాత స్థానికంగా టీడీపీ ఎమ్మెల్యేలతో గ్యాప్ కొనసాగుతుంది. ఈ క్రమంలో ఒంగోలులో బాలినేని స్థానంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిని జగన్ నియమించారు. తాజాగా జరిగిన పార్టీ ఒంగోలు సమీక్షలో జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒంగోలు అనగానే వాసన్న విషయంలో కొన్ని ప్రశ్నలు వస్తాయని వ్యాఖ్యానించారు. అదే సమయంలో వాసన్న మళ్లీ వస్తాడా అంటూ జగన్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. దీంతో బాలినేని వైసీపీలోకి రీ ఎంట్రీ ఖాయమేనా అనే ప్రచారం మొదలైంది. కాగా ఈ సమయంలోనే తన కుమారుడితో కలిసి బాలినేని బుధవారం డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో సమావేశం అయ్యారు. సుదీర్ఘంగా గంటన్నర పాటు ఇరువురు చర్చించుకున్నారు. ఒంగోలులోని పరిస్థితులను వివరించారు. ఆ తరువాత బాలినేని చేసిన ట్విట్ సంచలనంగా మారింది. తాను వైసీపీలోకి రీఎంట్రీ ఇస్తాననే ప్రచారం వేళ ఎక్కడా వైసీపీ పేరు ప్రస్తావన చేయకుండానే తన మనసులోని మాట ఏంటో స్పష్టం చేశారు. ఈ మేరకు బాలినేని చేసిన ట్విట్‌లు వైరల్‌గా మారింది. ఆయన మాకు ఒక నాయకుడు మాత్రమే కాదు, నమ్మకం, ఆదరణ, ఆశ్రయం ఆ ట్విట్‌లో పవన్‌తో ఉన్న ఫొటోలను జతచేసిన బాలినేని ఆయన మాకు ఒక నాయకుడు మాత్రమే కాదు, నమ్మకం, ఆదరణ, ఆశ్రయం అని పేర్కొన్నారు. దీని ద్వారా తన కుమారుడితో కలిసి పవన్‌కళ్యాణ్‌ను కలవడం ద్వారా తనయుడికి రాజకీయంగా స్పష్టమైన హామీ పొందినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బాలినేని తాజాగా ట్విట్ ద్వారా పవన్‌తోనే తమ రాజకీయం కొనసాగుతామని స్పష్టం చేసినట్లు విశ్లేషణలు మొదలయ్యాయి.

# పోలీసు జాగిలం సింధు మృతి పట్ల ఎస్పీ విచారం

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా పోలీసు భద్రతా విభాగంలో సుమారు 9 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించిన పోలీసు పేలుడు పదార్థాలు (పేలుడు)గుర్తించే జాగిలం సింధు వయస్సు 10 సంవత్సరాలు వయోభారం కారణంగా అనారోగ్యంతో గురువారం న మృతి చెందింది. సింధు మృతి పట్ల జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సింధు పార్థివదేహంపై పోలీసు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా పోలీసు శాఖకు సింధు అందించిన సేవలు మరువలేనివని, అనేక అనుమానస్పద ప్రదేశాలలో తనిఖీలు, విఐపీ బందోబస్తు విధులలో చురుగ్గా, సమర్థవంతంగా పనిచేసిందని తెలిపారు. సింధును పోలీస్ కుటుంబ సభ్యురాలిగా భావించామని, సింధు మృతి తీరని లోటని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. జర్మన్ షెఫర్డ్ జాతికి చెందిన సింధు 18 మే 2018 న ప్రకాశం జిల్లా పోలీసు శాఖలో చేరింది. ఏఆర్ కానిస్టేబుల్ పి.నరేష్ (పి సి 2768) ఈ జాగిలానికి హ్యాండ్లర్‌గా వ్యవహరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా పోలీసు కార్యాలయం నుండి సింధు పార్థివదేహాన్ని తీసుకెళ్లి కర్నూల్ రోడ్డు, మంగమూరు జంక్షన్ మీదుగా జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు చేరుకుని అక్కడ పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నివాసరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఏఆర్ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగాల పండుగకు శ్రీకారం - అచ్చాల రవి

**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి అమలు చేయలేదని, ఐదేళ్ల పాటు యువతను నిరాశలో ఉంచిందని కనిగిరి మున్సిపాలిటీ తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి గురువారం విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 10,060 పోస్టుల భర్తీకి స్పష్టమైన షెడ్యూల్‌తో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమని తెలిపారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు నింపిందన్నారు. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఈ జాబ్ క్యాలెండర్ రాష్ట్ర అభివృద్ధికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు.



# ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు

## - దేవాలయాలలో ప్రత్యేక పూజలు





**బల్లికురవ, మార్చి 19, (ప్రభాతవార్త)**

పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు గురువారం మండలంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. దేవాలయాలలో ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు భక్తులను అలరించాయి. వేద పండితులు ఉగాది యొక్క ప్రాధాన్యతను వివరించారు. తెలుగు వారి సంప్రదాయ లోగిలిలో నిర్వహించుకునే పండుగలలో ఉగాది ప్రత్యేకమైంది. ఉగాది శోభతో ఆరంభమైన చైత్రమాసం తన ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సృష్టికర్త ఈ జగత్తును చైత్రమాసంలో, శుక్ల పక్షంలో, పాఢ్య మినాడు, సూర్యోదయ ఆరంభంలో సృశించాడని విష్ణుపురాణం చెబుతుంది. ఋతువులన్నింటికి వసంతం అత్యంత ప్రాధాన్యమైంది. అలాంటి వసంతం తొలి వేళలో పలుకరించే శుభదినం ఉగాది. నక్షత్ర గణనతో కాలాన్ని లెక్కించడం ప్రారంభమైన రోజు కాబట్టి ఈ పర్వానికి ఉగాది అని పేరు. ఉగాది పర్వదినం నుండి శ్రీరామ వసంత పక్షం కొనసాగుతుంది. ప్రకృతి సర్వదా అనుకూలించాలని ఆకాంక్షిస్తూ, అష్టదిక్పాలకులకు అధిపతి అయిన ఇంద్రుడిని ఉగాది నాడు పూజించాలని మహా భారత పురాణం పేర్కొంది. షడ్రచుల సమ్మేళనంతో కూడిన ఆరోగ్య వర్ధక పదార్థాన్ని పరగడుపున స్వీకరించటం ఉగాది నాటి ప్రధాన విధి. పరాభవం అంటే సామాన్య అర్థం అవమానం, ఓటమి. బాహ్య ప్రతికూలతలను అధిగమించి, అంతరంగిక శక్తి, యుక్తులను ప్రతిబింబించుకోవడం. ప్రతి ఏటా వివిధ పేర్లతో ప్రజలను పలకరిస్తూ, గడిచిన కాలాన్ని అవలోకింప చేస్తూ, భవిష్యత్తును దర్శింప చేస్తూ, ప్రజలకు భవిష్యత్తు దర్శనిగా ఉగాది పర్వదినం బాసిల్లుతుందని వేద పండితులు వివరించారు. ప్రతి ఏటా నవ వసంత యామినిగా, నయన మనోహ ఆమనిగా ఉగాది పర్వదినం ప్రజలను పలకరించటం సృష్టి కార్యంలో భాగమేనని వివరించారు. ఈ సందర్భంగా స్థానిక వరసిద్ది వినాయక స్వామి ఆలయంలోనూ, గ్రామ దేవతల ఆలయాలలోనూ, శివాలయాలలోనూ, రామాలయాలలోనూ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పంచాంగ శ్రవణాలు, భక్తులను అలరించాయి.

# అన్నదాతను హడలెక్కించిన వరుణుడు



**బల్లికురవ, మార్చి 19, (ప్రభాతవార్త)**

ఉరుములు, మెరుపులతో గురువారం సాయంత్రం చిరు జల్లులు ప్రారంభం కావడంతో అన్నదాతల గుండెల్లో ఆందోళన మొదలైంది. ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న, ఎండుమిర్చి, బర్లీ పొగాకు రైతులు పరుగులు పట్టారు. ఈదురు గాలులు, చిరుజల్లులతో మొక్కజొన్న రైతులు తీవ్ర ఆందోళన చెందారు. చిరుజల్లులతోనే వరుణ దేవుడు శాంతించడంతో భూమి పుత్రులు బ్రతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**నాగులుప్పలపాడు, మార్చి 19, (ప్రభాతవార్త)**

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వాలు లక్ష్యం అని ప్రకాశం జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి పేర్కొన్నారు. గురువారం నాగులుప్పలపాడు మండలం వినోదరాయునిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న సుచిత్ర వీరయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు చేదోడువాదోడుగా ఉంటూ పెట్టుబడి సహాయం చేస్తూ వ్యవసాయంలో యాంత్రికరణ ప్రవేశపెడుతూ ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకాలు ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. మన ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ గ్రామాల అభివృద్ధికి నింతరం కృషి చేస్తున్నారన్నారు. జేసీ ప్రత్యేక చొరువతో ఇంత త్వరగా ఇక్కడ కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి రైతు భీమా తప్పనిసరిగా చేయించుకోవాలి. వ్యవసాయంలో వాడేటువంటి ట్రాక్టర్లు ఇతర వ్యవసాయ పరికరాలకు తప్పనిసరిగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని వ్యవసాయంలో అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లకుండా కొంత ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు.

### గిట్టుబాటు ధరలకు ప్రభుత్వం కొనుగోలు :

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతులు వద్ద నుండి పండించిన పంటలను కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పొగాకు ఉత్పత్తి దారుల సహాయ సహకారా సంఘం అధ్యక్షులు మండల జయంత్‌బాబు అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్ కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి వెంకటరావు, కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షులు ఈదర వెంకట కృష్ణారావు, కార్యదర్శి శేషగిరిరావు, వినోదరైనపాలెం గ్రామ పంచాయతీ అధ్యక్షులు చెన్నారెడ్డి నాగరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ తోట శ్రీనివాసరావు, కనపర్తి గ్రామ పార్టీ అధ్యక్షులు ఏడుగుండ్ల వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# యువతకు మాట ఇచ్చాం.. అమలు చేశాం

## - ఉగాది రోజునే జాబ్ క్యాలెండర్ విడుదల - ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**మార్టూరు, మార్చి 19, (ప్రభాతవార్త)**

ఉగాది పర్వదినాన రాష్ట్ర యువతకు శుభవార్త అందిస్తూ కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడం చారిత్రాత్మక నిర్ణయమని, జాబ్ క్యాలెండర్ కేవలం ప్రకటన కాదు.. అది నిరుద్యోగులకు ఇచ్చే నమ్మకం, భవిష్యత్‌కు బాట చూపించే పథకం అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. యువగళం, ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మాట తప్పకుండా అమలు చేయడం ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుందని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. ఉగాది సందర్భంగా విడుదలైన జాబ్ క్యాలెండర్ యువతకు భరోసా కలిగించే పథకమని, నిరుద్యోగులు గందరగోళం లేకుండా ప్రణాళికబద్ధంగా పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ఇకపై ప్రతి ఏటా ఉగాది రోజునే జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, సమయపాలన పాటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ప్రభుత్వ శాఖల్లో తొలి విడతగా 10,060 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు క్యాలెండర్‌లో పేర్కొనడం యువతకు ఉత్సాహానిచ్చిందని ఎమ్మెల్యే చెప్పారు జాబ్ క్యాలెండర్‌లో విద్యాశాఖ, పోలీసు శాఖలకు పెద్దపీట వేయడం గమనార్హమని ఏలూరి అన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, మరో సారి డీఎస్సీతో పాటు 3000 జూనియర్ లెక్చరర్ పోస్టులు, యూనివర్సిటీల్లో 1500 అధ్యాపక పోస్టులను భర్తీ చేయనుందని తెలిపారు. అదే విధంగా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా 1000 పోలీసు కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడం ప్రజా భద్రతకు మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే 6,28,347 మందికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి కల్పించడం గర్వకారణమని అన్నారు. జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ ప్రధాన విధానమని, సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో రాష్ట్రాన్ని బ్రాండ్ ఆంధ్రగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామని ఏలూరి తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వం స్పష్టమైన దిశను చూపించిందని, ఇకపై యువత సమయాన్ని వృధా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు. శ్రమ, ప్రతిభ ఉన్న వారికి ప్రభుత్వం అవకాశాలు వేదికగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# పొగాకు రైతులను ఆదుకోండి

**నాగులుప్పలపాడు, మార్చి 19, (ప్రభాతవార్త)**

పొగాకు పంట, శనగ తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరిని నాగులుప్పలపాడు మండలం బీజేపీ నాయకులు కోరారు. గురువారం నాగులుప్పలపాడు మండలం బీజేపీ నాయకులు ఎంపీ పురందేశ్వరిని కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి ఇందుకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. బీజేపీ తెలుగుదేశం, జనసేన, కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నారని, వారందరిని మరింత ఆదుకోవాల్సిన అవసం ఉందని వారు కోరారు. దగ్గుబాటి పురందేశ్వరి బీజేపీ నాయకులతో మాట్లాడుతూ శనగ పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అలాగే ధాన్యం, పసుపు, మిరప ఇతర పంటలకు గిట్టు బాటు ధర కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని పొగాకు పంటపై సస్ రద్దు చేశామని పొగాకు రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.



# రంగుల వలయాలు కాదు.. ఆకర్షణమైన బొమ్మలు కావు అవి..

## - భక్తుల సేవలో సిద్ధంగా నిలిచిన కేఎస్ఆర్టీసీ బస్సులు..!



**పెద్దదోర్నాల, మార్చి 19, (ప్రభాతవార్త)**

ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని శ్రీశైలం చేరుకున్న కర్ణాటక భక్తులను స్వస్థలాలకు సురక్షితంగా చేరుకునేలా కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ(కేఎస్ఆర్టీసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ పరిసర ప్రాంతాల్లోని పార్కింగ్ స్థలాలలో ఈ బస్సులను సిద్ధంగా ఉంచారు. రంగుల వలయాలు కాదు, ఆకర్షణ ఏమైనా బొమ్మలు కాదు, భక్తులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే సేవారథాలుగా కనిపిస్తున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా వారి రాకపోకలను సులభతరం చేయడానికి అవసరాన్ని బట్టి కర్ణాటక ఆర్టీసీ బస్సులను సిద్దం చేశారు. శ్రీశైలంలో రథోత్సవం ముగిసిన తక్షణం బయలుదేఏలా అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యంగా ప్రయాణించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంది. ఇసుకేస్తే రాలనంత జనం దర్శనం అనంతరం రథోత్సవం ముగిసిన వెంటనే బయలుదేరేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంచారు. పార్కింగ్ ప్రదేశంలో ఎర్ర బస్సులు శ్రేణులుగా నిలబడి ఉండడం చూసి భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా తమ గమ్య స్థానాలు చేరుకునేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఉగాది సందర్భంగా శ్రీశైలంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ విభాగాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయి. ఇదిలా ఉంటే కాలి నడక, పాదయాత్రలతో శ్రీశైలం చేరుకున్న భక్తులను తరలించేందుకు వారి వాహనాలు కూడా శ్రీశైలంలో సిద్దంగా ఉన్నాయి. ఉగాది పర్వదినం సందర్భంగా లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు రవాణా సౌకర్యం కల్పించడంలో ఏఎస్ఆర్టీసీ పాత్ర విశేషమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ బస్సులు భక్తులకు నిజమైన భరోసాగా నిలుస్తున్నాయి. ఇదిలా ఉంటే శ్రీశైలంతో పాటు దిగువ శ్రీశైలంగా పేరొందిన పెద్దదోర్నాల కూడా భక్తులతో కిటకిటలాడింది. ఉగాది పర్వదినం సందర్భంగా పెద్ద దోర్నాలలోని దేవాలయాన్ని భక్తులతో పోటెత్తి కిటకిటలాడాయి.

# మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు

## - సిట్టింగ్‌కు వెలుగు కార్యాలయం





**యర్రగొండపాలెం, మార్చి 19, (ప్రభాతవార్త)**

యర్రగొండపాలెం పట్టణంలో 4 మద్యం షాపులు, పదుల సంఖ్యలో బెల్టు షాపులు , 100లల్లో మొబైల్ బాయ్స్‌ల ద్వారా సరఫరా సరిపోవు అన్నట్లు ప్రభుత్వ కార్యాలయాలు అడ్డాలుగా చేసుకొని మద్యం తాగి మందు ఖాళీ బాటిళ్ళను కార్యాలయ ఆవరణలోనే వదిలిపోతున్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని పలు కార్యాలయాలతో పాటు ముఖ్యంగా వెలుగు కార్యాలయం ఆవరణ మందుబాటులకు అడ్డాగా మారింది. పట్టణంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో పలు ప్రభుత్వ కార్యాలయాలు నెలకొని ఉన్నాయి. ఇదే ఆవరణలో ఉన్న వెలుగు కార్యాలయానికి ప్రహారి గోడ లేకపోవడంతో మందుబాబులకు మంచి అడ్డాగా తయారైంది. సాయంత్రం అయితే చాలు అక్కడి పరిసరాలన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో ఆ ప్రదేశాన్ని నిర్మానుస్యంగా ఉంటాయి. దాంతో మందుబాబులకు ఈ ప్రదేశాలు సిట్టింగ్‌కు అనుకూలంగా ఉండడంతో కొంత మంది ఆకతాయిలు మద్యం బాటిళ్ళను తెచ్చుకుని తాగి సిసాలను అక్కడే వదిలి వెళ్తారు. చిమ్మ చీకటిగా నిర్మానుష్యంగా ఉండడంతో ఇక్కడే మందుబాబులు అడ్డాగా మార్చేశారు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు వస్తే చాలు ఖాళీ మందు సీసాలు బీరు సీసాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తాయి. మరికొన్ని సీసాలు పగులగొట్టి గాజు పెంకులతో చిందరబదరంగా పడి ఉంటాయి. ఇక్కడి వెలుగు కార్యాలయ సిబ్బందికి ప్రతి రోజు ఉదయం శుభ్రం చేసుకోలేక తిప్పలు తప్పడం లేదు. దాంతో సిబ్బంది ప్రహారి గోడ నిర్మించుకోవాలంటే వెలుగులో నిధుల్లేమితో కొట్టుమిట్టాడే పరిస్థితులు ఉండడంతో పరిస్థితిని చూడలేక ప్రహరి గోడ లేద ఇనుప కంచె నిర్మించుకోలేక సిబ్బంది వాపోతున్నారు.

### కల్వరి అగాపే చర్చిలో ఘనంగా అమావాస్య అభిషేక ఉపవాస ఆరాధన మహోత్సవం



**యర్రగొండపాలెం, మార్చి 19, (ప్రభాతవార్త)**

యర్రగొండపాలెం పట్టణంలోని కల్వరి అగాపే చర్చిలో అమావాస్య అభిషేక ఉపవాస ఆరాధన మహోత్సవం దైవ సేవకులు జి.ఇజ్రాయేలు అధ్యక్షతన భక్తి శ్రద్దలతో గురువారం ఘనంగా జరిగింది. ఈ ఆరాధన మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక భక్తి భావంతో ప్రార్ధనలు నిర్వహించారు. ఉదయం ప్రార్ధనలతో ప్రారంభమై ఈ మహోత్సవం, ప్రత్యేక అభిషేక సేవలతో కొనసాగింది. విశ్వాసులు ఉపవాస దీక్షతో దేవుని సన్నిధిలో ప్రార్ధనలు సమర్పించారు. సంఘ కాపరి జి.ఇజ్రాయేల్ రోగుల కొరకు, భక్తుల కుటుంబ శాంతి కొరకు, స్వస్థత, ఆరోగ్యం సుఖశాంతుల కోసం ప్రార్ధనలు చేసి దేవుని ప్రేమ, క్షమ, సేవా భావం గురించి సందేశం అందించారు. బిషప్ గొల్లపల్లి జాన్ పెద్దన్న, డైరక్టర్ తిమోతి ప్రోత్సాహంతో చెంచు ఫీల్డ్ యర్రగొండపాలెం కల్వరి అగాపే చర్చిలో నిర్వహించిన ఈ ప్రార్ధనలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు వివిధ జిల్లాల క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ సేవకులు వినుకొండ ఆదాం, యర్రగొండపాలెం నియోజకవర్గ పాస్టర్ల అధ్యక్షులు చేదురి లక్ష్మయ్య,విశ్వాసులు పాల్గొన్నారు.అనంతరం దైవ సేవకులు జి.ఇజ్రాయేల్ ప్రేమ విందునిచ్చారు.

# ఘనంగా ఉగాది వేడుకలు

## - ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్పై సాంబశివరావు



**పుల్లలచెరువు, మార్చి 19, (ప్రభాతవార్త)**

ఉగాది పండుగ తెలుగు ప్రజలకు ప్రత్యేకమైన పర్వదినమని ఎస్పై సాంబశివరావు అన్నారు. పుల్లలచెరువు మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ కళా ప్రాంగణంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉగాది పచ్చడిని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది అనేది షడ్రచుల సమ్మేళనం అని, జీవితంలో ఎదురయ్యే విభిన్న అనుభవాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు మనుషుల జీవితంలో కలిగే సుఖదు:ఖాలను, విజయాపజయాలను సూచిస్తాయని వివరించారు. సంవత్సరమంతా ఎదురయ్యే మంచి చెడులను సమానంగా స్వీకరించి, సంయమనంతో ముందుకు సాగాలని ఈ పండుగ మనకు బోధిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శాంతి నెలకొనాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా ప్రాంగణ సభ్యులు కేజే రఘు, ఉప్పల హనుమంతు, ఆర్మీ బుజ్జి, జీవి గురునాథం, చిల్లంచర్ల సుబ్బారావు, గాజులపల్లి కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రముఖులను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎస్ఐఓ





**యర్రగొండపాలెం, మార్చి 19, (ప్రభాతవార్త)**

శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ యర్రగొండపాలెం పట్టణంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, అభివృద్ధి, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, ఏఎంసీ చైర్మన్ సుబ్బయ్య, ఎంఈఓ ఆంజనేయులు, రవీంద్ర, ఉదయ్ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ సందీప్, ఆదిత్య వొకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ సేనారెడ్డి తదితరులను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఓ నాయకులు మాట్లాడుతూ ఉగాది పండుగ భారతీయ సంస్కృతిక్పితీకగా నిలుస్తుందని, ప్రతి కొత్త సంవత్సరం మనలో సానుకూల మార్పులకు దారి తీసేలా ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సహనం, పరస్పర గౌరవం పెంపొందించుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ కోస్తా ఆంధ్ర రీజినల్ పీఆర్ అండ్ మీడియా సెక్రటరీ రియాజ్, మార్కాపురం జిల్లా అధ్యక్షుడు సఫియుల్లా, పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, క్యాంపస్ సెక్రటరీ నాసర్, సభ్యులు వసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా మందిరంలో ఘనంగా ఉగాది వేడుకలు

## - విశిష్టులకు పురస్కారాలు - పంచాంగ శ్రవణం, ప్రముఖుల సత్కారం

## - పట్టణ వీధుల్లో వైభవంగా పల్లకి ఉత్సవం



**మార్కాపురం, మార్చి 19,(ప్రభాతవార్త)**

మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజార్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఉగాది పర్వదిన సందర్భంగా తెలుగు సంవత్సరాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో మైలటూరి రవిశంకర్ శర్మ శ్రీ పరాభవ నామ సంవత్సరానికి సంబంధించిన వివిధ రాశుల ఆదాయ,వ్యయాలు, శుభాశుభాలు, లాభనష్టాలపై పంచాంగ శ్రవణం చేశారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా డీఎస్పీ యు నాగరాజు , మున్సిపల్ కమిషనర్ నారాయణరావు , ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు బివిఎస్ శాస్త్రి, ప్రకాశం జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌వి రమణలు హాజరయ్యారు. మందిర కార్యదర్శి గోపాలునిహరిహరరావు సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి ఉగాది అతిథి పురస్కారాలు” ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. వైద్యరంగం నుంచి సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాహుల్, ఉపాధ్యాయ రంగం నుంచి సిఎస్ఆర్ మూర్తి (డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్, మంగళగిరి), ఎం సైదు బాబు (సబ్ ఇన్‌స్పెక్టర్, మార్కాపురం), గోపాలుని కృష్ణమోహన్, బండి మల్లికార్జున రావు (ఉపాధ్యాయులు), సాహిత్య రంగం నుంచి దేవులపల్లి విశ్వనాథ శాస్త్రి, (వైపాలెం), సంగీత రంగం నుంచి పురాణం సుబ్రహ్మణ్యం (సీనియర్ అడ్వకేట్), పత్రికా రంగం నుంచి దొండపాటి మోహన్ రెడ్డి (ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, మార్కాపురం), ఆధ్యాత్మిక సామాజిక సేవా రంగం నుంచి ఇమ్మడిశెట్టి వీరారావు (విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు), పాదర్తి లక్ష్మీమల్లికలను సన్మానించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ యు నాగరాజు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావులను మందిర కమిటీ సభ్యులు, మహిళా సంఘం, యువసేవ సమాజ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు పేరం సత్యనారాయణ, కోశాధికారి పివిఎల్ఎన్వి నాగరాజు , అగ్ని పత్రిక అధినేత కాలం రాజు రామకృష్ణ, కమిటీ సభ్యులు షేక్ కరీం భాషా, గూటూరి రంగప్రసాద్, సాయి సుబ్బారావు, పాలగిరి వెంకటేశ్వర్ రెడ్డి, విజయ్ సూర్య నాగేశ్వరరావు, రావిపాటి రామారావు, చెన్నకేశవులు, పిచ్చిరావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో సాయిబాబా వారి పల్లకి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అలరించారు.

# ఉగాది సంబరాలతో కళకళలాడిన మార్కాపురం కలెక్టరేట్

## - పంచాంగ శ్రవణం, మంగళ వాయిద్యాలతో సంప్రదాయబద్ధ వేడుకలు

## - పండితులకు సన్మానాలు, అర్చకులకు విశిష్ట పురస్కారాలు

## - ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



**మార్కాపురం, మార్చి 19, (ప్రభాతవార్త)**

మార్కాపురంపట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. మార్కాపురం జిల్లా ఏర్పడిన అనంతరం నిర్వహించిన తొలి ఉగాది వేడుకలు కావడంతో ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ వేడుకలకు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు,ఆర్డీవో పి.ప్రభాకర్,మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి అధికారులను మంగళ వాయిద్యాలతోసంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వేడుకల్లో భాగంగా ప్రముఖ వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించి నూతన సంవత్సర ఫలితాలను వివరించారు. ఉగాది పండుగ ప్రాముఖ్యతను వివరించిన ఈ కార్యక్రమం హాజరైన వారిని ఆకట్టుకుంది. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పండితులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఏర్పాటుతో అభివృద్ధికి నాంది పలికిందని, పరాభవ నామ సంవత్సరంలో మార్కాపురం జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మార్కాపురం ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, వెలుగొండ ప్రాజెక్టును త్వరలో పూర్తి చేసి ప్రాంత అభివృద్ధికి దోహదపడతామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అర్చకులకు జిల్లా విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉగాది వేడుకలను విజయవంతం చేశారు.

# క్రీస్తు సంఘముల ఐక్యవేదిక చారిటబుల్ ట్రస్ట్‌కు నూతన జిల్లా కమిటీ

## - చాట్ల గంగయ్య జిల్లా అధ్యక్షుడిగా, దర్శనం సుధీర్ బాబు ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక



**మార్కాపురం, మార్చి 19,(ప్రభాతవార్త)**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో క్రీస్తు సంఘముల ఐక్యవేదిక చారిటబుల్ ట్రస్ట్ నూతన జిల్లాకమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలోని హావేలీ బన్కెట్ కాన్ఫరెన్స్ ఫంక్షన్ హాల్లో జిల్లాలోని క్రీస్తు సంఘముల సువార్తికులు, డైరెక్టర్లు పాల్గొన్న సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ట్రస్ట్ మార్కాపురం జిల్లా అధ్యక్షుడిగా చాట్ల గంగయ్యను, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సింగా రాజేష్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా న్యాయవాది దర్శనం సుధీర్ బాబు, గొంగటి ఏలియా, గుర్రం బాబు ఎంపికయ్యారు. కార్యదర్శులుగా వేశపోగు భరత్ చంద్ర, ముట్కూరి దేవదానం, గుర్రం శరత్ బాబు, ఎనిబరా అచ్చయ్యలను నియమించారు. కోశాధికారిగా బుదాల అశోక్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా వంకాయలపాటి జర్మియా, వేశపోగు బాలు, చిలక ఇశ్రాయేలు, దర్శనం పెద్ద ఏసయ్య, రావినూతల సుధాకర్‌లను ఎన్నుకోగా, గౌరవ సలహాదారులుగా గంగవరపు దానియేలు బాబు, వంగలేటి సల్మాన్ రాజు, వంకాయలపాటి దేవిడ్ రాజు, సన్నపోగు సుందరాజులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వేశపోగు బాలు మాట్లాడుతూ జిల్లాలోని క్రీస్తు సంఘముల మధ్య ఐక్యత పెంపొందించేందుకు, సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు ట్రస్ట్ కృషి చేస్తుందని తెలిపారు.

# బీజేపీ కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు



**మార్కాపురం, మార్చి 19, (ప్రభాతవార్త)**

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు మార్కాపురం అసెంబ్లీ ఇంచార్జి పివి కృష్ణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు, షేక్ శబానా (మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నేషనల్ వైస్ చైర్మన్), దప్పిలి వినోద్ కుమార్ రెడ్డి, వేమూరి శ్రీనివాసులు, మాజీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బొంతల కృష్ణ, దేవిశెట్టి చంద్రశేఖర్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం మాట్లాడిన పివి కృష్ణరావు ఉగాది తెలుగుప్రజల ముఖ్య పండుగగా పేర్కొంటూ,ప్రతి ఒక్కరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడి జీవితంలోని తీపి, చేదు, షడ్రుచుల సమ్మేళనానికి ప్రతీక అని తెలిపారు.

# రోటరీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

**మార్టూరు, మార్చి 19, (ప్రభాతవార్త)**

పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన సంబరాలను గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు అలరించాయి. వేద పండితులు ఉగాది యొక్క ప్రాధాన్యతను వివరించారు. తెలుగు వారి సంప్రదాయ లోగిలిలో నిర్వహించుకునే పండుగలలో ఉగాది ప్రత్యేకమైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వెజిటేబుల్స్‌తో డెకరేషన్ చూపరులను ఆకట్టుకుంది.





## జూళ్లపాలెం తినారుళ్లకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

### - సంతనూతలపాడులో భక్తులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్ వసతి




**సంతనూతలపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
జూళ్లపాలెం బ్రహ్మంగారి తిరునాళ్లకు గురువారం నాడు ఒంగోలు ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో సంతనూతలపాడు మీదుగా ప్రత్యేక బస్సులను వేశారు. ఇందుకు గాను సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రత్యేక పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఒంగోలు ఆర్టీసీ డిపో నుండి వయా సంతనూతలపాడు, వయా టంగుటూరు మీదుగా ఈ తిరునాళ్లకు ఒంగోలు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో 35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్టు ఒంగోలు ఆర్టీసీ అసిస్టెంట్ ఎఫెట్స్ ఎల్.కోటేశ్వరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు కూలింగ్ వాటర్ వసతి :**
సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ పాయింట్లు జూళ్లపాలెం తిరునాల్లకు వెళ్లే భక్తులకు గురువారం నాడు సంతనూతలపాడు వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో వేసవిలో కూలింగ్ వాటర్ సదుపాయాన్ని కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఒంగోలు ఆర్టీసీ ప్రతినిధులు జీఆర్‌బి ముఖర్జీ, ఏ.వెంకటేశ్వర్లు, నరేంద్ర, మారుతి తదితరులు పాల్గొన్నారు. సంతనూతలపాడులో ఆర్టీసీ సిబ్బంది ఒంగోలు నుండి వచ్చే బస్సులను పాయింట్లు ఆపి భక్తులను ఎక్కిస్తున్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ తాగునీటి కార్యక్రమాన్ని వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్స్ వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, జీఎల్ ప్రసాదరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణి, వాసవి మహిళా క్లబ్ గౌరవ అధ్యక్షురాలు జి.సులోచన, తదితరులు పాల్గొన్నారు. తిరునాళ్లకు వెళ్లే భక్తులకు కూలింగ్ వాటర్ సదుపాయం కల్పించిన వాసవి క్లబ్ బృందానికి ఒంగోలు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కోటేశ్వరరావు, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**సంతనూతలపాడులో అన్ని ఆర్టీసీ బస్సులకు పాయింట్ కల్పించి ప్రయాణికుల ఇక్కట్లు పరిష్కరించాలి :**
నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడులో ముఖ్యంగా కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, ఆర్టీసీ డిపోల నుండి ఒంగోలు తదితర కేంద్రాలకు వెళ్లే ఆల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సులకు సంతనూతలపాడు కేంద్రంలో స్టేజీ లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే నియోజకవ్గ కేంద్రం అయిన సంతనూతలపాడుకు రావాలంటే బస్సులు స్టేజీలు లేక ప్రయాణికులు ఇక్కట్లు చెప్పరానివిగా ఉన్నాయి. రాత్రి వేళలో ఆర్డినరీ బస్సులు లేకపోవడం, ఎక్స్‌ప్రెస్ తదితర బస్సులకు మరోవక్క స్టేజీలు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాఉ. ఇటీవల సంతనూతలపాడు మండల సీపీఎం నేతలు దీనిపై ఒంగోలు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా కొన్ని రోజులు పాటు ఆయా బస్సులు సంతనూతలపాడులో నిలిపారు. మరలా తదుపరి నేడు యధావిధిగా కొనసాగుతుంది. నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడు కేంద్రంలో ఆయా బస్సులకు స్టేజీలు లేకపోవడం మరింత దారుణం. రాత్రి పది గంటల తదుపరి ఒంగోలు ఆర్టీసీ డిపోలో ఆర్డినరీ బస్సులు నిలిచిపోతాయి. విజయవాడ, తిరుపతి తదితర కేంద్రాలకు వెళ్లిన సంతనూతలపాడు వాసులు ముఖ్యంగా రాత్రి వేళలో తమ గ్రామానికి వచ్చేందుకు ఆయా బస్సులు ఆగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆయా ఆర్టీసీ బస్సులకు నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడు లో స్టేజీలు కల్పించి ప్రయాణికులు ఇక్కట్లు పరిష్కరించాల్సిందిగా పలువురు కోరుతున్నారు. అంతే కాకుండా కొత్తగా మార్కాపురం జిల్లా ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో సంతనూతలపాడు కేంద్రం నుండి ఉద్యోగులు మార్కాపురం తదితర కేంద్రాలకు వెళ్లేందుకు దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## గుర్తుతెలియని యువకుడు మృతి



**సంతనూతలపాడు(మద్దిపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామ సమీపంలో గల ఎన్‌హెచ్16 పై ఓవర్ బ్రిడ్జికి పడమర వైపు సర్వీసు రోడ్డుగానుకొని ఉన్న మంచినీటి చెరువులో కల్వర్టు వద్ద 22 నుండి 30 సంవత్సరాల లోపు గల గుర్తు తెలియని యువకుడు మృతదేహం వెలుపడింది. మృతుడు నాలుగు రోజుల క్రితమే చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఎత్తు 5.7 అడుగులు, మృతుడి శరీరమంతా కుళ్ళిపోయి పురుగులు పట్టి శరీరమంతా తోలు ఊడి తల వెంట్రుకలంతా ఊడిపోయి పడి ఉన్నాయి. రెండు కళ్ళు బయటికి వచ్చాయి. మృతుడు ఎరుపు లైట్ బ్లూ కలర్ కలిగి నిండు చేతులు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడు ఎడమ చేతి పైన ఎన్‌బీటీ అనే పేరుగల పచ్చబొట్టు ఉంది. మృతుడు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే దిగువ నెంబరుకు మద్దిపాడు ఎస్సై 9121102133, ఒంగోలు రూరల్ సీఐ 9121102130 లకు తెలియచేయాలని ఎస్సై వెంకట సూర్య తెలిపారు.

## రుద్రవరంలో కూలింగ్ చలివేంద్రం ప్రారంభం




**సంతనూతలపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామంలో గురువారం నాడు సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కూలింగ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సూపర్ స్టార్ కృష్ణ అభిమాని కుక్కల గోవిందరాజులు ఆధ్వర్యంలో కూలింగ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత మూడు సంవత్సరాల నుండి గోవిందరాజులు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. నిర్వాహకులు కుక్కల గోవిందరాజులుచే చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ఐదునెలల పాటు ఈ చలివేంద్రాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు గోవిందరాజులు పేర్కొన్నారు.

## పలు ఆలయాల్లో ఘనంగా ఉగాది వేడుకలు





**సంతనూతలపాడు, మార్చి19, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలో పలు ఆలయాల్లో గురువారం నాడు ఘనంగా ఉగాది వేడుకలు జరిగాయి. సంతనూతలపాడులోని భూదేవి శ్రీదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో పరాంకుశం అజయ్ బాబు చార్యులు ఆధ్వర్యంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో వేద పండితులు వావిలాల వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. భక్తుల అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామివారి ఆలయంలో ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా సంతనూతలపాడులోని చెన్నకేశవస్వామి, ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద గల సీతారాముల వారి ఆలయంలో అర్చకులు, వేద పండితులు దివి వెంకట రమణాచార్యులు, పి.చక్రాచార్యులు, వావిలాల వెంకట సుబ్రహ్మణ్యం, వి.నాగ సాయి కృష్ణ శర్మ, నేలబట్ల శ్రీనివాసరావు, గూడా శివరామకృష్ణ, గూడా సాయిరాంలు ఈ పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో అర్చకులు ఎస్.బుజ్జి బాబు శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం చేపట్టారు. చెన్నకేశవస్వామి, త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో ఎండోమెంట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి, ఆధ్వర్యంలో ఆలయాల చైర్మన్‌లె ఎస్.ఉమామహేశ్వరరావు, దుంపా సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద జరిగిన పంచాంగశ్రవణ కార్యక్రమాన్ని ఆలయకమిటీ అధ్యక్షులు వేమా మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, సెక్రటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు, కోశాధికారి వేమా చిన్న వెంకట కృష్ణారావు, కమిటీ సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

## స్టాలిన్‌పాల్‌కు ఏఐసీసీసీ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేత



**కురిచేడు, మార్చి 18, ప్రభాతవార్త**
కురిచేడు మండలం కాశీపురం గ్రామానికి ఏఐసీసీసీ సభ్యుడు పాస్టర్ స్టాలిన్ పాల్‌కి కాలి విరిగింది. ఈ సంగతి తెలుసుకున్న ఏఐసీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎండ్లూరి ఆదాం వారి బృందం గురువారం స్టాలిన్ నివాసానికి వెళ్లిఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఏఐసీసీసీ తరుపున రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ఎండ్లూరి ఆదాం, ప్రకాశం జిల్లా సెక్రటరీ గొంగటి జాన్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ గందం ఆశీర్వాదం, లీగల్ అడ్వైజర్ ప్రముఖ న్యాయవాది అబ్రహం లింకన్, దొనకొండ మండల ఏఐసీసీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం కూరగాయల మార్కెట్ వద్ద తీవ్ర రద్దీ

### - ప్రజలకు నరకయాతన



**మార్కాపురం, మార్చి 19, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణం నడిబొడ్డులో ఉన్న కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పరిస్థితి రోజురోజుకీ అధ్వాన్నంగా మారుతోంది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఇరువైపులా మున్సిపల్ రూములు ఉన్నప్పటికీ, వాటిని వినియోగించకపోవడంతో రోడ్డుపైనే వ్యాపారాలు విస్తరించాయి. ఒక వైపు చికెన్ షాపులు, మరో వైపు కూరగాయల బండ్లు రోడ్డును ఆక్రమించడంతో తీవ్ర రద్దీ నెలకొంది. మార్కెట్‌లో ఉండాల్సిన వ్యాపారులు బయట రోడ్డుపైనే బండ్లు పెట్టుకోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఉదయం నుండి సాయంత్రం వరకు టూ వీలర్లు, ఆటోలు, ఇతర వాహనాలు, పాదచారులు కలిసి రాకపోకలు సాగించడంతో కాలు పెట్టడానికి కూడా స్థలం లేకుండా పోతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక మున్సిపల్ కార్యాలయానికి చెందిన ఖాళీగా ఉన్న ఆరు రూములకు ఇప్పటివరకు నోటిఫికేషన్ జారీ చేసి అద్దెకు ఇవ్వకపోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. ఒకవైపు రూములు ఖాళీగా ఉండగా, మరోవైపు రోడ్లపై అక్రమంగా వ్యాపారం సాగించడం మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో, కొందరు అధికారులు అనధికారికంగా బండ్లు, షాపులు ఏర్పాటు చేసుకునేందుకు మౌఖిక అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూరుతూ, ప్రభుత్వానికి నష్టం జరుగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య కూడా రోజురోజుకీతీవ్రమవుతోంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ఆ మార్గంలో ప్రయాణించడం కష్టసాధ్యంగా మారింది. అత్యవసర సేవల వాహనాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో,పోలీస్‌శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు తీసుకుని రోడ్డు ఆక్రమణలను తొలగించడం, వ్యాపారులను మార్కెట్ ప్రాంగణంలోకి మార్చడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం అవసరమని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రంజాన్ సందర్భంగా సేవా హస్తం.. పేద మహిళల్లో ఆనందం..

### - టిడిపి రాష్ట్ర నాయకులు మస్తానయ్య ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం




**మార్కాపురం, మార్చి 19, ప్రభాతవార్త**
రంజాన్ పండుగను పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో పేద ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులు, చీరల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర నాయకులు మస్తానయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ రంజాన్ పర్వదినం నేపథ్యంలో ప్రతి ముస్లిం కుటుంబంలో ఆనందం నింపాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పేదలకు సహాయం చేయడం ద్వారా వారి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో మార్కాపురం జిల్లా సాధన జరిగిందని, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సారథ్యంలో జిల్లా అభివృద్ధి దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను గత 13 సంవత్సరాలుగా నిరంతరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హర్షిత బాబి, చల్లగాలి సాగర్,మొగల్ జబీర్, ఓబినబోయిన రామాంజనేయులు, నందం శేఖర్, జాకబ్, తిరుపతయ్యతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు నాలుగు కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాలకొండ ఆలయంకు ఉగాది పురస్కారం

### - వేదపారాయణుడికి సీఎం చంద్రబాబు సత్కారం

### - అభినందించిన ఆలయ అధికారులు



**కందుకూరు మార్చి 19, ప్రభాతవార్త**
ఉగాది పర్వదిన నేపథ్యంలో నూతన తెలుగు పరాభవనామ సంవత్సం సందర్భంగా మాలకొండ దేవాలయంలో వేదపారాయణులుగా పనిచేస్తున్న మండాది మధుమురళీ కృష్ణ ఘణాపాటి గురువారం సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. రాష్ట్రంలో దేవాలయాల్లో భక్తిపారవశ్యంతో భక్తులకు విశిష్టసేవలు అందించిన అర్చకులకు,వేద పండితులకు ప్రత్యేక పురస్కారాలు ప్రదాన కార్యక్రమాన్నివిజయవాడలో నిర్వహించారు. ఈ నేపద్యంలో మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వేదపారాయణులుగా పనిచేస్తున్నమురళీకృష్ణఎంపికైనారు. దీనితో ఆయనకు విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రతిష్ఠాత్మక ఉగాది పురస్కారం అందచేశారు. దేవస్థాన ప్రాశస్త్యాన్ని,ఆధ్యాత్మిక సేవలు అందించడంలో మాలకొండ ఆలయవిశిష్టతకు ఈ గౌరవం లభించిందని ఆలయ ఉప కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ డిప్యూటీ కమీషనర్, సూపరింటెండెంటు కోన ప్రసాద్‌తోపాటు పలువురు అర్చకులు సన్మానగ్రహీతను అభినందించారు.

## రోగులకు పండ్లు అందచేసిన ఎమ్మెల్యే సతీమణి

### - వైద్యశాలలో సౌజన్య సేవాకార్యక్రమాలు



**కందుకూరు మార్చి 19, ప్రభాతవార్త**
కందుకూరు ఏరియా ఆసుపత్రిలో గురువారం స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తమ కుమారుడు కుమారుడు అవినాష్ జర్మదినం సందర్భంగా ఆమె పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బెడ్‌లమీదగల రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. రోగులకు సత్వర సేవలు అందించాలని సౌజన్య వైద్యశాల సూపరింటెండెంటు డా॥ ఇంద్రాణికి సూచించారు. వారంతా త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు రోగులు సౌజన్యను దాతృత్వాన్ని ప్రశంసించారు. ఆమెకు పలు ఆశీర్వచనాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బందితోపాటు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ,పట్టణ మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మిరాజ్యంతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

## ఈ ఏడాది తిరుగులేని శక్తిగా ఎమ్మెలే నాగేశ్వరరావు

### - టీడీపీ కార్యాలయంలో పంచాంగశ్రవణం

### - పూజలు నిర్వహించిన ఇంటూరి దంపతులు



**కందుకూరు మార్చి 19, ప్రభాతవార్త**
ఈ ఏడాది ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు నియోజకవర్గంలో తిరుగులేనితిరుగులేని రాజకీయ శక్తిగా ఎదగడం ఖాయమని పంచాంగ కర్త శేషాచార్యులు అన్నారు. ఉగాది పర్వదిన సందర్భంగా గురువారం స్థానిక తెదేపాకార్యాలయంలో పరాభవనామ సంవత్సర వేడుకలును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు,సౌజన్య దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగకర్త శేషాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు పట్ల ప్రజాభిమానం పెరుగుతుందన్నారు. కందుకూరు నియోజకవర్గ చరిత్రలో ఆయన తిరుగులేనిరాజకీయ శక్తిగా ఎదగడం ఖాయమన్నారు. కొత్త ఏడాదిలో వర్షాలు సమృద్ధిగా సకాలంలో కురుస్తాయని, వ్యవసాయం రైతులకు బాగా కలిసి వస్తుందని శేషాచార్యులు తెలిపారు. రాజకీయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు మరింత బలపడతాయన్నారు. రాష్ట్రం మరింత పురోభివృద్ధిలో పయనిస్తూ, పారిశ్రామిక అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతిపక్షాలకు పరాభవం తప్పదని పంచాంగం వినిపించారు. ఈ సందర్భంగా కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం,కందుకూరు సిఐ అన్వర్ బాషా,పట్టణ ఎస్సై శివనాగరాజు,పలువురు మ్మెల్యేకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి అధ్యక్షులు ఘట్టమనేని హరిబాబు,పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షులు బుస్సా రెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు,వివిద హోదాల్లో గల నేతలు షేక్ రఫీ,బెజవాడ ప్రసాద్,చదలవాడ కొండయ్య,ఉప్పుటూరిశ్రీనివాసరావు,అల్లం వెంకటేశ్వర్లు,ముచ్చు శ్రీనివాసరావు, గడ్డం మాలకొండయ్య,ముచ్చు లక్ష్మిరాజ్యం, అశ్విని,పార్వతి,కామాక్షి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వరాహ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం

### - వేద పండితులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం




**సింగరాయకొండ, మార్చి 19, ప్రభాతవార్త**
మండలంలోని దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ క్షేత్రం,శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం ఉగాది పర్వదినం సందర్భంగా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం రాజ్యలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయ స్వామి వార్ల మూల విరాట్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం దేవస్థానం ప్రాంగణంలో చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించి భక్తులకు వినిపించారు. అనంతరం రాత్రి దేవస్థానం ప్రాంగణంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగానిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన పాలకమండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు దంపతులు, భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణవేణి, అర్చకులు ఉదయగిరి వెంకట శేషలక్ష్మీనరసింహచార్యులు, ఉదయగిరి సుదర్శనచార్యులు,విక్కిరాల లక్ష్మీనరసింహచార్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా టెన్త్ పరీక్షల నిర్వహణ

### - దివ్యాంగులకు సౌకర్యాల లేమి.. అధికారులపై ఆరోపణలు



**సింగరాయకొండ,మార్చి 19, ప్రభాతవార్త**
జిల్లాలో మార్చి 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షులు కె. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో వారు పలుఅంశాలను ప్రస్తావించారు. జిల్లా డీసీఈబీ, ఏసీ, హెడ్మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ డీఈఓల మధ్య సమన్వయం లోపించడం వల్ల పరీక్షల నిర్వహణలో గందరగోళం నెలకొన్నట్లు తెలిపారు. ఒకే పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా ఒకే వ్యక్తులకు డ్యూటీలు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల వద్ద పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పరీక్షల బాధ్యతలు అప్పగించడం కూడా నియమావళికి విరుద్ధమని విమర్శించారు. దివ్యాంగ విద్యార్థుల విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిజికల్ హ్యాండిక్యాప్ ఉన్న విద్యార్థులకు వీల్‌చైర్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో, వారు సుమారు 400 మీటర్ల దూరం వరకు తల్లిదండ్రుల భుజాలపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. దివ్యంగా విద్యార్థులకు సహాయం చేస్తున్న కొందరు ఉపాధ్యాయులను డిప్యూటీ డిఈఓ బెదిరిస్తున్నారని కూడా ఆరోపించారు. ఈ పరిస్థితిపై జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక వెంటనే స్పందించి, పరీక్షా కేంద్రాలను స్వయంగా పరిశీలించి విద్యార్థులకు న్యాయం చేయాలని టీచర్స్ గిల్డ్ నాయకులు డిమాండ్ చేశారు.

## ప్రజల దాహార్తి తీర్చే GSK సేవలు అభినందనీయం




**సింగరాయకొండ, మార్చి 19, ప్రభాత వార్త**
వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు జి.ఎస్.కె సంస్థల సేవలు అభినందనీయమని సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.హెచ్.హాజరత్తయ్య తెలిపారు. పట్టణంలోని ట్రంక్ రోడ్డులో సీవీఆర్ హాస్పిటల్ ఎదురుగా ఉగాది పర్వదినం సందర్భంగా గురువారం బిళీరీ సంస్థల అధినేత గంజి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఐ సి.హెచ్ హాజరత్తయ్య, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా చలివేంద్రాన్ని సీఐ హాజరత్తయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం హాజరత్తయ్య, డైరెక్టర్ వేల్పుల సింగయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పరిసర గ్రామాల నుంచి సింగరాయకొండ పట్టణానికి వచ్చే పాదచారులు, ప్రయాణికులు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాకా శ్రీనివాసులు, మేకల అంకారావు, మేకల నరేష్, మేకల మల్లికార్జున, జమ్ము శంకర్, చల్లా శ్రీనివాసులు, అంకిపల్లి బంగారు బాబు, వేల్పుల ముసలయ్య,చీమట మాధవ,బచ్చు సురేష్,గంజి సుబ్బారావు,మాజీ సొసైటీ డైరెక్టర్ చీమట కోటేశ్వరరావు, బొట్టా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య ప్రాథమికోన్నత పాఠశాల గుర్తింపు రద్దు

**సింగరాయకొండ,మార్చి 19, ప్రభాతవార్త**
మండలంలోని మూలగుంటపాడు గ్రామంలో ఉన్న శ్రీ చైతన్య నవోదయ ప్రాథమికోన్నత పాఠశాలపై జిల్లా విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల గుర్తింపును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14న చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో కనిగిరికి చెందిన ఆరో తరగతి విద్యార్థి సయ్యద్ తౌషిక్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన జిల్లాలో కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ తక్షణమే త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. ఫిబ్రవరి 22న పాఠశాలను సందర్శించిన కమిటీ విద్యార్థుల వసతి, భద్రత, పర్యవేక్షణ తదితర అంశాలపై సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలు అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉన్నట్లు కమిటీ గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో 2026 నుండి 2027విద్య సంవత్సరానికి సంబంధించి పాఠశాల గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ జారీ చేసి వివరణ కోరారు. అయితే నిర్ణీత గడువులో యాజమాన్యం సమాధానం సమర్పించకపోవడంతో 2026 నుండి 2027 విద్య సంవత్సరానికి శ్రీ చైతన్య నవోదయ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తూ చర్యలు తీసుకున్నట్లు డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు. ఈ చర్యతో జిల్లాలోనిప్రైవేట్ విద్యాసంస్థలపై పర్యవేక్షణ మరింత కఠినంగా మారనున్నట్లు పలువురు భావిస్తున్నారు.

## ఆదర్శపాలన అందిస్తున్న మంత్రి లోకేష్

### - లోకేష్‌ను అభినందిస్తున్న డా॥ దివి



**కందుకూరు మార్చి 19, ప్రభాతవార్త**
సూపరిపాలన అందిస్తున్న మంత్రి నారా లోకేష్ సుపరిపాలన అందిస్తున్నారని కందుకూరు మాజీ ఎమ్మెల్యే మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న లోకేష్‌కు కృతజ్ఞతలన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో ఐటి శాఖ మరియు మానవ వనరులఅభివృద్ధి శాఖామాత్యులు నారా లోకేష్ బాబు నేతృత్వంలో సుపరిపాలన అందిస్తుందన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నిరుద్యోగ యువతీ , యువకులకు ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుండడం ప్రశంసనీయమని డా॥ శివరాం అన్నారు. ఈ మేరకు ఉగాది పర్వదినం సందర్భంగా విడుదల చేయడం అంటే నిరుద్యోగుల పట్ల లోకేష్ బాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తొలి ఏడాది16 వేలకు పైగా టీచరు పోస్టులు,5500 కానిస్టేబుల్ పోస్టులు, 900 పైగా గ్రూప్ 2 ఉద్యోగాల నియామకం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రైవేట్ రంగంలో లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించని ఘనత లోకేష్‌కు దక్కుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని మాయమాటలు చెప్పి నిరుద్యోగులను మోసం చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఆరోపించారు. లోకేష్ బాబు నిరుద్యోగులకు అండగా నిలుస్తూ 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వ , ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే చూస్తూ ఓర్వలేని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోర్టుల్లో కేసులు వేస్తూ నిరుద్యోగుల పట్ల కక్ష తీర్చుకుంటున్నారని శివరాం మండిపడ్డారు. తాతకు తగిన మనవడిగా,తండ్రికి తగ్గ తనయుడిగా లోకేష్ పాలన సాగుతుందన్నారు. ఇటువంటి ఉద్యోగ అవకాశాలు భవిష్యత్తులో మరెన్నో కల్పించి భావితరాలకు ఆదర్శ నాయకుడిగా లోకేష్ బాబు నిలుస్తాడనే విశ్వాసం బలంగా ఉందని శివరాం కొనియాడారు.

## మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ గర్భగుడి పునర్నిర్మాణానికి విరాళాలు వెల్లువ

**సంతనూతలపాడు, మార్చి 19, ప్రభాతవార్త**
మండల పరిధిలోని మల్లవరంలో వేంచేసియున్నశ్రీ వెంకటేశ్వరస్వామి గర్భగుడి పున:నిర్మాణానికి విరాళాలు వెలువచ్చాయి. గర్భ గుడి జీర్ణోద్ధరణ కు సుమారు 50 లక్షల పైగా విరాళాలు రావడంతో వారిని గురువారం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ మారినేని రాఘవ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ విచ్చేసి దాతలను ఘనంగా సత్కరించారు. గర్భగుడి పునర్నిర్మాణానికి ఆలయ సర్వేజన అన్నసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు లైన నారి పెద్ది వరహాల చౌదరి, బోయపాటి సుధాకర్‌లు కమిటీ తరుపున 25 లక్షలు, శ్రీ వారి వనం అధ్యక్షులు, మార్నేని కృష్ణారావు కుటుంబ సభ్యులు 15 లక్షలు, విశ్రాంత న్యాయమూర్తి వెంకటకృష్ణయ్య ఐదు లక్షలు, పోతినేని శ్రీనివాస రావు అలియాస్ పీఎస్ఆర్ 6 లక్షలు, కట్టా సూర్య నారాయణ 3 లక్షలు, గొల్లపల్లి శ్రీనివాసరావు లక్ష రూపాయలు, కావూరి వాసు లక్ష, రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఉప్పు గుండూరి నాగేశ్వరరావు, కార్యదర్శి మందపల్లి శ్రీనివాస్, టీడీపీ నేతలు గట్టినేని మల్లిఖార్జున, వడ్డంపూడి శ్రీను, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు,ఆలయ ఈవో లీలాకృష్ణతో పాటు ఆలయట్రస్టుసభ్యులు గాలి రాంబాబు, సింగరాజు వెంకటేశ్వర్లు, ప్రధానఅర్చకులు వెంకటాచార్యులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## రుచులతో రంజింప చేస్తున్న కనిగిరి ఆర్కే ఫ్యామిలీ రెస్టారెంట్

**- ఫంక్షన్ హాల్ సదుపాయం కూడా అందుబాటులో**



**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలో భోజన ప్రియుల హృదయాలను గెలుచుకుంటూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్న ఆర్కే ఫ్యామిలీ రెస్టారెంట్ రోజు రోజుకు ప్రజాదరణ పొందుతోంది. అనేక రకాల వెజిటేరియన్, నాన్ వెజ్ వంటకాలు, ఘుమఘుమలాడే ప్రత్యేక వంటకాలతో ఈ రెస్టారెంట్ కనిగిరి తాలూకా ప్రజలను ఆకట్టుకుంటోంది. రుచికరమైన భోజనంతో పాటు శుభ్రత, నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు మంచి సేవలు అందించడం ఈ రెస్టారెంట్ ప్రత్యేకతగా నిలుస్తోంది. కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో భోజనం చేయడానికి అనుకూలంగా ఉండటంతో ప్రతి రోజు పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి వస్తున్నారు. ఇదిలా ఉండగా వివాహ రిసెప్షన్లు, పుట్టినరోజు వేడుకలు, ఇతర ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా ఫంక్షన్ హాల్ కూడా అందుబాటులో ఉందని రెస్టారెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని కనిగిరి తాలూకా ప్రజలు వినియోగించుకోవాలని రెస్టారెంట్ నిర్వాహకుడు పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కనిగిరి తాలూకా ప్రజలకు ఆయన ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## శవాన్ని స్మశాన వాటికకు తరలించకుండా అడ్డుకున్న పోలీసులు

**- మృతురాలి బంధువులతో పోలీసులకు తీవ్ర వాగ్వాదం**






**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

పట్టణంలోని బోయపాలెనికి చెందిన బొప్పరపు అంజమ్మ(80) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, ఆమె అంత్య క్రియల సందర్భంగా స్మశానవాటికపై వివాదం చెలరేగింది. శవాన్ని వాల్మీకి స్మశాన వాటికకు తరలించేందుకు ప్రయత్నింగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు గత 150 సంవత్సరాలుగా కొత్తూరు సమీపంలోని హైవే పడమర వైపున ఉన్న వాల్మీకి స్మశాన వాటికలోనే మట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ మృతదేహాన్ని కూడా అక్కడే మట్టి చేస్తామని భీష్మించారు. అయితే ఆ స్మశాన వాటికగా ఉపయోగిస్తున్న భూమి సర్వే నంబర్ 554లోని సుమారు 5 ఎకరాలు 34 సెంట్లు ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసిన పట్టాదారు స్థలమని, అక్కడ మట్టి కార్యక్రమాలు నిర్వహించరాదని వారు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలు వచ్చినట్లు తహసీల్దార్ జయలక్ష్మీ స్పష్టం చేశారు. ఈ నేపధ్యంలో గురువారం మధ్యాహ్నం శవాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు, పోలీసులు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సీఐ ఉప్పుటూరి శ్రీనివాసులు, ఎస్సై సందీప్, ఎమ్మార్వో జయలక్ష్మీ, స్థానికులకు హిందూ స్మశాన వాటికలో మట్టి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. తహసీల్దార్ జయలక్ష్మీ మాట్లాడుతూ వాల్మీకి సామాజిక వర్గం ప్రజలకు అర్బన్ కాలనీలో రెండు ఎకరాల స్థలాన్ని స్మశాన వాటికగా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇతర ప్రాంతాల్లో కూడా స్థలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే వాల్మీకి వర్గం ఆ స్థలాలను అంగీకరించడం లేదని చెప్పారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తడంతో పోలీసులు తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వగా, మున్సిపాలిటీ ద్వారా శవాన్ని తరలించేలా కమీషనర్ పర్వతనేని శ్రీధర్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ వాల్మీకి వర్గం ప్రజలతో చర్చలు జరిపి, అధికారులతో మాట్లాడాఉ. వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు తమ పూర్వీకుల కాలం నుంచి అదే స్మశాన వాటికలో మట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అక్కడ సమాధుల ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ స్థలాన్ని కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చే క్రమంలో స్మశాన వాటికను ఆక్రమించారని ఆరోపించారు. గత 45 రోజుల క్రితం జేసీబీలతో సమాధులను పగలగొట్టి కొత్తూరులోని రావిగుంటలో పడేశారని వారు అధికారుల ముందు వాపోయారు. మృతదేహానికి అదే చోట మట్టి కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే హైవేపై అంత్యక్రియలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తుదకు మట్టి కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం, అధికారులతో చర్చించి భవిష్యత్తులో ప్రత్యామ్నాయ స్మశాన వాటిక ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు తెలిపారు. అయితే మున్సిపాలిటీ వాళ్ల మృతదేహాన్ని తరలించేందుకు మున్సిపాలిటీ ట్రాక్టర్‌ను సిద్దం చేశాఉ. రాత్రి వరకు మృతురాలి బంధువులు స్మశాన వాటికలోనే మట్టి కార్యక్రమాలు చేయాలని భీష్మించుకొని కూర్చోగా అధికారులు మాత్రం సమయాత్రను అడ్డుకున్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు



**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని ముస్లిం సోదరులకు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాసం, ప్రార్ధనలు, దానం, సేవ భావనలను పెంపొందించే పవిత్ర కాలమని అన్నారు. ఈ నెలలో ముస్లిం సోదరులు నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు పాటిస్తూ సమాజానికి ఐక్యత, సహనం, సౌభ్రాతృత్వం సందేశం ఇస్తారని తెలిపారు. రంజాన్ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సఖ్యత నెలకొని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

**- డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి**



**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ పండుగ త్యాగం, నియమ నిష్ఠ, దానం, సేవా భావాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఒక నెల పాటు ఉపవాస దీక్షలు పాటించి, ప్రార్ధనలు నిర్వహించిన ముస్లిం సోదరులు ఈద్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నింపాలని కోరుకున్నారు. సమాజంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా జీవించాలని ఆమె ఆకాంక్షించారు. ముస్లిం సోదరులందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని శ్యామల కాశిరెడ్డి కోరారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు

**- మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు**



**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ ఉపవాసం, ప్రార్ధనలు, దానం, సహనం వంటి సద్గుణాలను పెంపొందించే పవిత్రమైన పర్వదినమని అన్నారు. ఒక నెల పాటు కఠిన నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు పాటించిన ముస్లిం సోదరులు ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ ప్రతి ఇంట ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నింపాలని కోరుతూ సమాజంలో శాంతి, సఖ్యత, సౌభ్రాతృత్వం పెరగాలని ఆయన అభిలాషించారు. ముస్లిం సోదరులందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ఆకాంక్షించారు.

# పదవి లేకపోయిన ప్రజల్లోనే ఉంటా

**- మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్**

**- వార్డులో పర్యటిస్తూ.. సమస్యలను పరిష్కరిస్తున్న మాజీ చైర్మన్ అబ్దుల్ గఫార్**



**కనిగిరి, మార్చి 19, ప్రభాతవార్త**

కనిగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పట్టణంలోని వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. గురువారం 14వ వార్డులోని రజకపాలెం ప్రాంతంలో పర్యటించిన ఆయన స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అక్కడ నెలకొన్న తాగునీటి సమస్యపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మున్సిపల్ చైర్మన్ పదవీ కాలం మంగళవారంతో ముగిసినప్పటికి ప్రజా సేవకు పదవులు అవసరం లేదన్నారు. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు. పదవి లేకపోయినా ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నాయకుడిని ప్రజలే నిలబెడతారని అన్నారు. ఇకపై ప్రతి రోజు వార్డులో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, వీధి దీపాలు, సైడు కాలువలు నిర్వహణ, అంతర్గత రహదారులు ఏర్పాటు చేయటంలో తన వంతు చొరువ చూపుతానని అన్నారు.

## ప్రగతి కోచింగ్ సెంటర్‌కి నవోదయ, ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నికలలో రాష్ట్ర ర్యాంకులు

**- ప్రగతి అకాడమీ డైరక్టర్ యు.నాగరాజు**



**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**

దర్శిలోని ప్రగతి కోచింగ్ సెంటర్‌కి రాష్ట్ర స్థాయి ర్యాంకుల్లో భాగంగా నవోదయలో మూడు ర్యాంకులు రావడం పట్ల ప్రగతి అకాడమీ డైరక్టర్ యు.నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యు.నాగరాజు మాట్లాడుతూ నవోదయలో జిల్లా 10వ ర్యాంకు రావడం, పాలిటెక్నిక్ ఏపీఆర్‌జేసీలలో కూడా రాష్ట్ర స్థాయి ర్యాంకులు 11,355 ప్రగతి కోచింగ్ సెంటర్‌కి వచ్చాయని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సహించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చు అని ఈ విద్యార్థులు నిరూపించారని ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తమ గమ్యాన్ని చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మరోసారి అభినందనలు తెలిపారు. మా కోచింగ్ సెంటర్ నందు పేద విద్యార్థులకు కూడా విద్యను అందించడం జరుగుతుందన్నారు.

## దివ్యాంగుల సంక్షేమం అభివృద్ధికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం




**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల ఆర్గనైజింగ్ స్కెటరీ సందు వెంకట్రావు తెలిపారు. సీఎం ప్రాంభించిన దివ్యాంగుల శక్తి పథకం క్యాక్రమంలో వెంకట్రావుతో పాటు దర్శి నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు పూసల ఓబయ్య పాల్గొన్నారు. ఉచిత బస్సు పథకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారని అన్నారు. అధికార గర్వం లేకుండా సాక్షాత్తు ముఖ్యమంత్రి తమ పక్కన కూర్చొని భోజనం వడ్డిస్తూ కష్టసుఖాలు వినడం తమకు కొండంత అండగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్‌తో కలిసి బస్సులో ప్రయాణించినట్లు దివ్యాంగుల సంఘం నాయకులు సందు వెంకట్రావు పూసల ఓబయ్య తెలిపారు.

# క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లపై పోలీసులు ఉక్కుపాదం

**- బెట్టింగ్ పాల్పడిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ - డీఎస్పీ లక్ష్మీనారాయణ**




**దర్శి, మార్చి 19, ప్రభాతవార్త**

క్రికెట్ బెట్టింగ్‌కి పాల్పడిన పలువురిని అదుపులోకి తీసుకుని వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం దర్శి లోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శి డీఎస్పీ బి.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ కేసులో ఈ మధ్య అరెస్టు రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను కోర్టు ద్వారా మూడు రోజులు తమ కస్టడికి తీసుకున్నట్లు వివరించారు. మరింత లోతైనా విచారణ కోసం కస్టడికి తీసుకున్నట్లు వారు వివరించారు. పోలీసులు తీసుకుంటున్నటువంటి ఈ చర్యల పట్ల బెట్టింగ్ రాయుళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తినట్లు అయింది. వీళ్లు కాకుండా డబ్బులకు ఆశపడి బెట్టింగ్ పెట్టిన వారిని సుమారు 11మందిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. త్వరలో మళ్లీ ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో బెట్టింగ్ ముఠా కార్యకలాపాలను పూర్తిగా ఉక్కు పాదంతో అణిచివేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యువకులు బెట్టింగ్ మహమ్మారి వలలో పడకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఎస్సైలు మల్లిఖార్జున, శివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధువుకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



**కందుకూరు మార్చి 19, ప్రభాతవార్త**

పెండ్లి కుమార్తెను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు పట్టణం బలిజపాలెంలో వివాహ సందర్భంగా నూతన వధువు దారం లక్ష్మిపల్లవిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఆశీర్వదించారు. వధువు తల్లి జ్యోతితోపాటు పలువురు బంధువులును ఆయన అభినందించారు. అదేవిధంగాఉలవపాడు మండలం చాకిచెర్లలో జరిగిన వివాహరిసెప్షన్‌లో నూతన దంపతులు డా|| గంటా హేమసుందర్, డా||సుప్రియసింగ్‌లను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దారం మాల్యాద్రి, దారం కృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, అన్న క్యాంటీన్ చైర్మన్ కొండలరావు, పార్టీ నాయకులు రావూరి రామకోటయ్య, మేడా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## చీరాల 1 టౌన్ పోలీసు స్టేషన్ ఎస్సై భాస్కరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ఎస్పీ ఉమామహేశ్వర్

**- అశ్రునయనాల మధ్య జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్న చీరాల డీఎస్పీ మొయిన్**

**- సమర్థవంతంగా విధులు నిర్వహించే అధికారిణి కోల్పోవడం బాధాకరం**

**- ఈ సంఘటన ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి ఒక హెచ్చరికగా భావించాలి**

**- పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి - జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు**




**చీరాల, మార్చి 19, ప్రభాతవార్త**

అంకిత భావంతో విధులు నిర్వహించే పోలీసు అధికారిణి కోల్పోవడం తీరని లోటని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. చీరాల 1 టౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వల్లాగి భాస్కరరావు మార్చి 18న ఉదయం స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని చీరాల 2 టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల ఆయన స్వగృహంలో గురువారం ఉంచారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ మొయిన్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్సై పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.1,00,000 నగదు ఆయన సతీమణికి అందజేశారు. అనంతం జరిగిన అంతిమ యాత్రలో చీరాల డీఎస్పీ పార్థివ దేహ పేటికను స్వయంగా మోశారు. రాంనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపున ఉన్న స్మశాన వాటికలో కులాచారాల మేరకు పోలీసు లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించారు. శ్రీ వల్లాగి భాస్కరరావు 1982 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి, తన కృషి నిబద్దత, నిజాయితీతో క్రమంగా వివిధ హోదాల్లో పదోన్నతులు పొంది ఎస్సై హోదాలో చీరాల 1 టౌన్‌లో విధులు నిర్వహించారు. సుమారు 42 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహించే అధికారిణి ఆకస్మికంగా కోల్పోవడం పోలీసు శాఖకు తీరని లోటన్నారు. నిబద్దత, క్రమశిక్షణ గల అధికారి పోలీసు శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. విధులు నిర్వహించే పోలీసులు అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఇతర శాఖల విధులతో పోలిస్తే పోలీసు శాఖ విధులు భిన్నంగా ఉంటాయన్నారు. పని ఒత్తిడి వల్ల సరైన విశ్రాంతి సమయం అనేది ఉండదన్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించాల్సి ఉంటుందన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించేవారు పని ఒత్తిడి ఉన్నప్పటికి ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు సమయాన్ని కేటాయించుకోవాలన్నారు. ఏదైనా చిన్న ఆరోగ్య సమస్య తలెత్తిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్య విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ మొయిన్, 1 టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా వేనూతల కాటంరాజు ఉత్సవం



**కొనకనమిట్ల, మార్చి 19, ప్రభాతవార్త**

ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని గొట్లగట్టు, నాగంపల్లి, చిన్నమనగుండం గ్రామాలలో యాదవుల ఆధ్వర్యంలో వేనూతల కాటంరాజు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గొట్లగట్టు రుద్రకొండపై వెలసిన వేనోతుల కాటమరాజు స్వామికి తొలుత ఊరేగింపు చేస్తూ ఉత్సవాలు నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. కొండపైన వెలసిన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేకంగా బొల్లావులతో ఊరేగింపు చేశారు.

## ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమం



**అద్దంకి , మార్చి 19, ప్రభాతవార్త**

సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా చిన్న పిల్లలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ స్టేట్ కోఆర్డినేటర్ సందిరెడ్డి కొండలరావు చేతుల మీదుగా దేవస్థానం ప్రాంగణంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు పాలకమండలి అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకర్ రావు, పాలకమండలి సభ్యులు నూతి ప్రసాద్, కోనంకి సుబ్బారావు అర్చక సిబ్బంది వేద పండితుల సమక్షంలో 100 మంది పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు పలకలు బలపాలు, స్వీట్స్ ఇచ్చి స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదం అందజేశారు. పిల్లలు పిల్లల తల్లిదండ్రులు చాలా సంతోషంగా దేవస్థానం సన్నిధిలో అక్షరాభ్యాసం చేసుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. మా ఇంటి వద్ద కూడా చేసుకోలేని ఈ అక్షరాభ్యాసం దేవస్థానం ప్రాంగణంలో చేసుకోవడం, స్వామివారి సన్నిధిలో చేసుకోవడం మా అదృష్టం అనిఅందరూ స్వామివారిని వేడుకున్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



**అద్దంకి , మార్చి 19, ప్రభాతవార్త**

రోటరీ ఆధ్వర్యంలో గీతా మందిరంలో గురువారం ఉదయం 10 గంటలకు రోటరీ క్లబ్ సింగరకొండ శ్రీవాసవి ధన్వంతరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు పంచాంగ శ్రవణం జరిగింది. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ సందర్భంగా ఊటుకూరి ఉమా అన్నపూర్ణ ఉగాది పురస్కారం అందజేశారు. అనంతరం భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు మిత్రులు అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ రామకోటేశ్వరరావు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, అన్నగి సుబ్బారావు ,రామయ్య లక్ష్మీరెడ్డి ,కరి రామయ్య, సంకా బాబు అహ్మద్ రఫీ అమ్జాద్ భాష ,కరి శ్రీ లక్ష్మి ,గాదేపల్లి దివాకర్ దత్తు , ఊటుకూరుకూరి ఉమా అన్నపూర్ణ, శ్రావణ్ కుమార్, వాసవి క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు




**అద్దంకి, మార్చి 19, ప్రభాతవార్త**

సింగరకొండలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో గురువారం సాయంత్రం 5 గంటలకు అద్దంకి వాస్తవ్యులు సిద్ధాంతి గుంటూరు శేషసుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో దేవస్థాన ప్రాంగణంలో వినాయక స్వామి వారి ప్రాంగణంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితులు ఆధ్వర్యంలో జరిగింది. పాలక మండల అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకర్‌రావు దంపతులు, దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, పాలక మండల సభ్యులు ఏల్చూరి వెంకటనారాయణమ్మ, ఆకుల కోటేశ్వరమ్మ, నూతి ప్రసాద్ దంపతులు తదితరులు పాల్గొన్నారు. భక్తులందరూ వారి జన్మ నక్షత్రము రాశులతోటి ఆదాయము ఖర్చులు వివరములు ఎలా ఉంటుందో అన్ని విషయాలు తెలుసుకొని పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, ఆలయ అర్చకులు అవధాని పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గోశాలకు దాన వితరణ



**అద్దంకి , మార్చి 19,ప్రభాతవార్త**

ఉగాది పండుగ సందర్భంగా వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ నాగలక్ష్మి, సునీత, సుజాత ఆధ్వర్యంలో సింగరకొండలోని గోశాలకు గోవులకు దాన అందజేశారు. ఈ కార్యక్రమంలో 14 వేల రూపాయల విలువ గల ఒక ట్రాక్టర్ గ్రాస్ గడ్డి గోవులకు సంబంధించిన సుబ్బారావుకి అందచేశారు. ఈ కార్యక్రమం సింగరకొండ దేవస్థానం చైర్మన్ చుండూరు మురళి సుధాకరరావు సహాయ సహకారాలతో చీరాల భ్రమరాంబ సేవ సమితి వారు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో అయితా రాజా, తాత హరిబాబు, ఉడత ఆదినారాయణ, రమణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## గాలా 2 కే 26 పెస్టివల్ వాలీబాల్ పోటీలలో విన్నర్స్‌గా సెయింట్ ఆన్స్ విద్యార్థులు



**వేటపాలెం, మార్చి 19, ప్రభాతవార్త**

సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాల విద్యార్థులు వాలీబాల్ జట్టు కిట్స్ అక్షర్ గాలా 2 కే 26 పెస్టివల్ వాలీబాల్ పోటీలలో విన్నర్స్‌గా గెలుపొందినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కళాశాల కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణ రావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. కిట్స్ అక్షర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గుంటూరులో ఇటీవల జరిగిన అక్షర్ గాలా 2 కే 26 పెస్టివల్ సందర్భంగా జరిగిన వాలీబాల్ పోటీలలో పాల్గొన్న 46 జట్లతో పోటీపడి సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల జట్టు ఎస్ఆర్‌కే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విజయవాడ మధ్య జరిగిన ఫైనల్స్‌లో విన్నర్స్‌గా నిలిచి విన్నర్స్ ట్రోఫిని పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు తెలిపారు. ఈ జట్టులో ఆర్.రమణ, జీవీఆర్ తేజారెడ్డి, కేఆంద్రూస్, జి.మైకేల్, కే.డాని, కే.సాయికుమార్, ఎం.రేవంత్ వెంకట మణి కుమార్‌లు జట్టు పాల్గొన్నట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేర్ ఆర్‌వి రమణ మూర్తి, డాక్టర్ సి.సుబ్బారావు, డైరక్టర్ వనమా దొర నాగ సాయి నాథ్, డైరక్టర్ బి.సాయి చరణ్ రాజు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొని వాలీబాల్ జట్టుకు అభినందనలు తెలిపారు.

# మోరావారి పెళ్లి సందడిలో ఇన్‌చార్జి దద్దాల



**హనుమంతునిపాడు, మార్చి 19, ప్రభాతవార్త**

హనుమంతునిపాడు మండలం మోరావారిపల్లి గ్రామంలో మోరా వెంకటేశ్వరరెడ్డి- అంజమ్మ దంపతుల కుమారుడు మోరా పరమేశ్వరరెడ్డి వెడ్స్ మృదులరెడ్డి వివాహ వేడుకలో కనిగిరి వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షులు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామల సాంబిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వేసపోగు గురు ప్రసాద్, మండల ప్రచార కమిటీ కలికాయి నారాయణ, దాసరపల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభా సాల్మన్ రాజు, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మల్లెల వెలుగొండయ్య, ఇట్టం కృష్ణ, కొండపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొండా రెడ్డిపల్లి సర్పంచ్ కలుకూరి చిన్న, మోర లక్ష్మీరెడ్డి, మోర ఆంజనేయరెడ్డి, మోర మల్లిఖార్జునరెడ్డి, కంది నారాయణరెడ్డి, మోర సాంబ, గంటా చెన్నారెడ్డి, ఎర్రంరెడ్డి శ్రీనివాసరెడ్డి, గంట లక్ష్మీరెడ్డి, షేక్ కాశీం, కాటినేని సదాశివ, షేక్ మౌలాలి, తాళ్లపల్లి లక్ష్మణ, వడ్లమూడి చినబాబు, ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దావా సమను

**అండర్ ఆర్డరు 5 రూల్సు 1&5 ఆఫ్ సి.పి.సి**
**కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**ఓ.ఎస్.నెం.161/2019**

గర్రె కృష్ణమూర్తి.....వాది
వర్సెస్
బోగిశెట్టి వెంకటేశ్వర్లు......ప్రతివాది
టు
ప్రతివాది:
బోగిశెట్టి వెంకటేశ్వర్లు
తండ్రి చిన్నయ్య
రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయ్
కోటగడ్డవారి వీధి,
గిద్దలూరు, మార్కాపురం జిల్లా,

పై నెంబరున వాది దావా పరిహారము కోరి మీపైన దావా దాఖలు వేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలున్నచో తేది: 31-03-2026న పగలు 10.30 గంటలకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పైకోర్టువారి ఎదుట హాజరై తెల్పుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించ బడునని తెలుసుకొనేది.

(By Order of the Court)

వాయిదా తేది: 31-03-2026
కనిగిరి
తేది:12-03-2026

ఇట్లు
అబ్దుల్ గఫార్ షేక్
వాదితరపు న్యాయవాది
కనిగిరి, మార్కాపురం జిల్లా

